అన్ని వర్గాల అభ్యున్నతికి కేసీఆర్ కృషి


క్రిస్టియన్ మైనార్టీ కమిటీ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: అన్ని వర్గాల అభ్యున్నతికి మాజీ సీఎం కేసీఆర్ కృషి చేశారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో ఆయనను కలిసిన క్రిస్టియన్ మైనార్టీ కమిటీ సభ్యులు సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తించిన నగర ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్ర మంత్రి అయ్యారని, కానీ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారాన్ని మరిచిన ఆయనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు. ఈ సమావేశంలో వెంకట్‌రెడ్డి, రాజీవ్‌సాగర్, ప్రణయ్, ప్రశాంత్, జయరాజ్, స్యాంసన్, దయాకర్, ఆంథోనీ, దాస్, విజయ్‌పాల్ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్‌లో..

రాంగోపాల్‌పేట్: నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేసిన పజ్జన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్‌తో ఆధ్వర్యంలో రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని చుట్టలబస్తీ, నల్లగుట్ట, మెక్లెడ్‌గూడ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, ఆంజనేయులు, గౌరిశంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దాసారం బస్తీలో..

అమీర్‌పేట: ఎన్నికల సమయంలో వచ్చి మాయ మాటలు చెప్పే పార్టీల నాయకులను నమ్మొద్దని బీఆర్ఎస్ నాయకులు కోరారు.సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని బుధవారం సనత్‌నగర్ డివిజన్ దాసారం బస్తీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కొలను బాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి,షాబాద్ శ్రీనివాస్‌రావు, కుమార్,ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి డివిజన్‌లో..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్‌కు మద్దతుగా బుధవారం సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీ, మహ్మద్‌గూడ ప్రాంతాల్లో కార్పొరేటర్ సామల హేమ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టని బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, తరచూ పార్టీలు మారే కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను ఈ ఎన్నికల్లో తిరస్కరించాలని ఈ సందర్భంగా హేమ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

బన్సీలాల్‌పేట్: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా బుధవారం సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ, సీనియర్ నాయకులు నాగేందర్(రాజప్ప) డాక్టర్ రవీందర్ గౌడ్, మనోజ్‌కుమార్, మహేష్, మల్లికార్జున్ తదితరులు కలిసి వివిధ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఎంపీగా ప్రాతినిథ్యం వహించిన కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా ఉన్న పద్మారావు ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం..దేశాన్ని పాలించిన బీజేపీ హయాంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం శూన్యమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన గ్యారంటీలను అమలు చేసిందన్నారు.

కేంద్రంలో మార్పునకు కాంగ్రెస్ అధికారంలోకి రావాలి

సనత్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్పు మొదలైందని, అదే విధంగా కేంద్రంలోనూ మార్పు రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ సీనియర్ నేత, సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా బుధవారం ఆయన సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్లలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదింటికి సంబంధించి ప్రజలు లబ్ధి పొందుతూ ఆనందంగా ఉన్నారన్నారు. దేశమంతా రావాలంటే కేంద్రంలో కూడా అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ గెలిస్తేనే సంక్షేమం, అభివృద్ధి

లాలాపేట: దేశంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి ఐతేనే పేద ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం నిరంతరాయంగా కొనసాగుతుందని సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ(చింతల్ కిట్టు) అన్నారు. దానంకు మద్దతుగా బుధవారం తార్నాక, గోఖుల్‌నగర్, షిర్డీ సాయినగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సతీష్, మల్లప్ప, అమర్, సంతోష్, ఎం.రాజు పాల్గొన్నారు.

అడ్డగుట్ట డివిజన్‌లో..

అడ్డగుట్ట: సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని బుధవారం అడ్డగుట్ట డివిజన్‌లో కాంగ్రెస్ నేత మంద సురేష్ నేతృత్వంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి వివరించారు. ప్రచారంలో ప్రకాష్, జాన్, లక్ష్మమ్మ, దేవమ్మ, పద్మ, నర్సమ్మ, కిష్టయ్య, రాజు, వినోద్ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోదీ హయాంలోనే దేశం అభివృద్ధి


ప్రచార సామగ్రిని అందజేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత నరేంద్ర మోదీదే అని బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బేగంపేటలో జరిగిన డివిజన్ బూత్ లెవల్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దశాబ్ద కాలంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర మంత్రి హోదాలో కిషన్‌రెడ్డి తన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారన్నారు. అనంతరం ఓటరు లిస్ట్, ఇతర సామగ్రిని బూత్ లెవల్ కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో మర్రి పురురవరెడ్డి, నగేష్, నందు, మహేష్, జయమ్మ, రేణుకా, సంధ్య లక్ష్మీ, మంగ పాల్గొన్నారు.

సనత్‌నగర్: బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కస్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డికి మద్దతుగా బుధవారం శ్రీనివాస్‌యాదవ్, వరప్రసాద్‌ చారి, అశోక్‌యాదవ్, హరి ఇంటింటి ప్రచారం చేశారు.

బౌద్ధనగర్: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం లాలాపేటలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నిర్వహించనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సీనియర్ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బౌద్ధనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపునకు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సారంగపాణి, రవి ప్రసాద్ గౌడ్, కార్తీకరెడ్డి, నాగేష్‌రెడ్డి, రాజభూపాల్, విద్యాసాగర్, కృష్ణమూర్తి, హరి, ప్రభుగుప్త, శారద, దత్తు, మహేష్, రాజేష్, పోచయ్య, అంబాల రాజు, హనుమంతు, శ్రీధర్, మహేష్ పాల్గొన్నారు.



సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ ఎన్టీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎంఆర్‌పీఎస్ నాయకులు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి జిల్లా బీజేపీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి హాజరై మోదీని మళ్లీ ప్రధాన మంత్రి చేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

బౌద్ధనగర్: డివిజన్‌లోని అంబర్‌నగర్‌లో కిషన్‌రెడ్డికి మద్దతుగా బుధవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మేకల సారంగపాణి పాల్గొని మాట్లాడారు. మళ్లీ ప్రజలందరూ బీజేపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో హనుమంతు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈటలకు మద్దతుగా..

రసూల్‌పురా: బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా బీజే పీ నాయకులు మూడవ వార్డు పరిధిలోని జనక్‌పురి కాలనీ,అస్బెస్టాస్ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, కార్ఖాన బస్తీ, బాలంరాయి ప్రాంతాల్లో కంటోన్మెంట్ కన్వీనర్ మాచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో శ్యాంకుమార్, కనకరాజు, ఇటికే దయానంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్‌దే విజయం


గులాబీ కండువాలతో నివేదిత, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసిన కంటోన్మెంట్‌లో విజయం సాధించేది బీఆర్ఎస్ పార్టీయేనని ఆ పార్టీ అభ్యర్థి నివేదిత సాయన్న తెలిపారు. బుధవారం నియోజకవర్గం 2వ వార్డులో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసూల్‌పురా, శ్రీలంక బస్తీ, జగదీష్‌నగర్, 105 గల్లీలో నివేదిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులు ఇస్తూ పూలు జల్లుతూ నివేదితకు ఘన స్వాగతం పలికారు. నివేదిత మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల మద్దతుతో తన తండ్రి సాయన్న ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పలు అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు పేదలకు అందజేశారని తన తండ్రి లాగే తానూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శ్రీనివాస్, కుమార్, రఘురామన్, శ్యామ్, శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

◆ ఏడో వార్డులో బోర్డు మాజీ సభ్యులు పి.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బోర్డు మాజీ సభ్యురాలు పి. భాగ్యశ్రీ, సీనియర్ నాయకులు కేబీ. శంకర్రావు, యశ్వంత్. శత్రుఘ్న, మధు, శేఖర్ పాల్గొన్నారు.

◆ రసూల్‌పురా: నివేదిత గెలుపే లక్ష్యంగా గులాబీ శ్రేణులు ముందుకు సాగాలని కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కంటోన్మెంట్ డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్‌లో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి, అభ్యర్థి నివేదిత హాజరయ్యారు. ఐదు రోజుల పాటు కష్టపడితే ఐదేళ్ల పాటు నివేదిత కంటోన్మెంట్ ప్రజలకు సేవలందిస్తారన్నారు. ఎన్నికల అనంతరం కంటోన్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ అడ్రస్ గల్లంతే అని స్పష్టం చేశారు. అనంతరం అక్కడ పెట్టిన దేఖ్‌లేంగే పాటకు వేదికపై ఉన్న వారంతా గులాబీ కండువాలు తిప్పుతూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ, శ్యాంకుమార్, లోక్‌నాథ్. ఆకుల రూప హరికిష్ణ, టీఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీ బరిలో ఓయూ ప్రొఫెసర్ నతానియేలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సైన్స్ కాలేజీ ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.నతానియేలు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. బుధవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో పెద్దపల్లి జిల్లా నివాసి అయిన మొట్టమొదటి ఓటు వేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాంగోపాల్‌పేట్: విపరీతంగా మద్యం తాగి అపస్మారక స్థితిలో పడిపోగా దానికి తోడు భారీ వర్షంతో శరీరం తడిచి ప్రాణాలు కోల్పోయాడు ఓ వ్యక్తి ఉదయం చూసే సరికి ముక్కు,పెదాలను ఎలుకలు కొరుక్కుని తిన్న ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఔట్ గేట్ వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 40-45 ఏళ్ల వయసుండే ఓ వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం, సాయంత్రం ఫుల్లుగా మద్యం తాగి సికింద్రాబాద్ ఔట్‌గేట్ పక్కన ఉండే గోడ వద్ద పడుకున్నాడు.రాత్రి ఒక గంటపాటు భారీగా వర్షం కురువగా వర్షంలోనే ప్రాణాలు కోల్పోయాడు. తెల్లవారిన తర్వాత చనిపోయిన ఆ వ్యక్తి ముక్కు, పెదాలు, శరీరం ఎలుకలు కొరుకుతుండటం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి ఒంటిపై నీలం రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని సంబంధీకులు ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై వేణుగోపాల్ తెలిపారు.

'సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం'

అమీర్‌పేట: ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పనిచేసే పారామెడికల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆల్ ఇండియా ఈఎస్ఐసీ మెడికల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు మేరకు తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 18 డిమాండ్లను పరిష్కరించడంలో అధికారులు జాప్యం వహిస్తున్నారని రోగుల సంరక్షణకు అంతరాయం కలుగకుండా ఈ నెల 11 వరకు నిరసనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో శీను, అశోక్, రామకృష్ణ, లోకేష్, రమేష్, పటేల్, కర్ణాకర్ రెడ్డి, సారయ్య, యుగంధర్, ఎస్‌కె.ప్రసాద్,శోభన్‌బాబు పాల్గొన్నారు.

తలసీమియా భారాన్ని తగ్గించేలా ఉచిత స్క్రీనింగ్ సేవలు

సనత్‌నగర్: తలసీమియా వ్యాధి భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం టీ-డయాగ్నస్టిక్ సెంటర్లలో స్క్రీనింగ్ సేవలను ఉచితంగా అందిస్తుందని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. బుధవారం బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తలసీమియా అనేది బలహీనపరిచే రక్త రుగ్మత అని, ఈ పరిస్థితుల్లో హిమోగ్లోబిన్ అణువులు సరిగ్గా ఏర్పడవన్నారు. మైనర్ తలసీమియాలో తేలికపాటి రక్తహీనత ఉంటుందని, ప్రధాన తసేసీయాలో తీవ్రమైన రక్తహీనతతో జీవితాంతం రక్తమార్పిడి అవసరమన్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. గురువారెడ్డి మాట్లాడుతూ.. తలసీమియాతో కలిగే హిమోగ్లోబినోపతి, రక్తహీనత గురించి వైద్యులందరూ తెలుసుకోవాలని, ప్రతి ఒక్కరూ తలసీమియా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మంజుల అనగాని, ఉషారాణి, ఆర్ఎస్‌వీ శ్రీకృష్ణ, చిన్మయి రాత, నాబాత్ పాల్గొన్నారు.

15 చలివేంద్రాల ఏర్పాటు: జీఎం వినోద్‌కుమార్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జలమండలి జీఎం వినోద్‌కుమార్ చెప్పారు. రోడ్డు పక్కన..ప్రధాన రహదారులు..జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 15 చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా చలివేంద్రాల్లో ఫ్రీజ్‌లను ఏర్పాటు చేసి చల్లటి నీరు అందిస్తున్నట్లు వివరించారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు. తాగునీరు, డ్రైనేజీ ఇతరత్రా సమస్యల విషయంలో సకాలంలో స్పందించే విధంగా ఆయా సెక్షన్ పరిధిలోని మేనేజర్లు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రజా సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బస్తీలు, ఏరియాలు, ఇతరత్రా ప్రాంతాల్లో ప్రజలు మంచినీటిని వృథా చేయరాదని జీఎం వినోద్ కుమార్ ప్రజలకు సూచించారు. సుదూర ప్రాంతం నుంచి పైపులైన్ల ద్వారా మంచినీటిని నగరానికి తీసుకొచ్చి అందిస్తున్నామని ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

కార్మిక హక్కులను హరిస్తున్న బీజేపీని ఓడించాలి : సీపీఐ

అడ్డగుట్ట: కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. తుకారాంగేట్‌లోని సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గౌరి నాగరాజు నేతృత్వంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను బీజేపీ ప్రభుత్వం హరిస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతీ కార్మికుడు, సీపీఐ కార్యకర్త క్రియాశీలకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఉపయోగపడే ఏ పని చేయలేదని, నిరంతరం మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయాల్లో లబ్ధి పొందుతుందన్నారు. ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరచడం, ప్రశ్నించే గొంతులను నొక్కుతూ ఈడీ, సీబీఐలను ఉసిగొల్పుతూ అక్రమంగా అరెస్టులు చేయడం బీజేపీ ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. బీజేపీని రాజకీయ సమాధి చేసి, సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కి పట్టం కట్టాలని కోరారు. శ్రీనివాస్, బాబు, రవి, కుమారస్వామి, రాములు, సాయిలు, నాగరాజు, రమేష్, రాజు, మోసిన్, శేఖర్, మల్లేష్, సల్మాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి ప్రగతికి నిరంతరం కృషి చేస్తా..

లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్

నాగోలు: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర ఎంపీ అభ్యర్థి పెండ్యాల శేషసాయి వర ప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, బాలానగర్, రాజు కాలనీ, కీసర, మేడ్చల్, కంటోన్మెంట్‌ల్లోని వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తాను మల్కాజిగి ఎంపీగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఇంటి సంక్షేమం, పేదల కోసం , ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్ పరిధిలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంతో పాటు యువకుల కోసం నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహిళల అభివృద్ధి, భద్రత, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజవర్గంలో తాను చేపట్టిన పలు సేవ కార్యక్రమాలను కాలనీ వాసులకు వివరించారు. మానిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి అంశానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు వైష్ణవీ ప్రసాద్‌కు మద్దుతు ప్రకటించారు. దుడ్డు సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, మంగపతిరావు, దర్శనం శర్మ, ఆలూరి, గొల్లపూడి రాజేశ్వరరావు, మంగు రాఘవరావు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో వైష్ణవీ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు